# దొంగ...దొంగ

-ఉరిటి సులేఖ

వంట గది నుండి కుక్కర్ శబ్దం, బయట గేట్లు కొట్టుకుంటున్న చప్పుడు, కార్నర్ ఫ్లాట్‌లో చంటిపాప ఏడుపు, గేటవతల స్టార్టవ్వక అల్లరి పెడ్తోన్న స్కూటర్ గోల, గోడవతల స్కూల్ ఆటో హారన్ అరుపు, హడావుడిగా పరిగెడ్తోన్న ఉద్యోగిని అలుపు, ఆఫీసుకు టైమైపోతోన్న భర్త కేక, టిఫిన్ డబ్బా మర్చిన భర్తని వెంటాడుతోన్న భార్య పిలుపు-వెరసి ప్రతి ఉదయపు మా అపార్టుమెంటు.

ఆరోజు ఎప్పట్లానే ఎవరి తొందర్లో వాళ్ళున్నాం-మా వంటగది కిటికీ పక్క ఫ్లాటులో ఓ చిన్ని కుటుంబం ఉంటున్నారు. భార్య, భర్త, ఏడాది పిల్లాడు, పిల్లాడి నానమ్మ, వీళ్ళే కుటుంబ సభ్యులు-

సమయం ఎనిమిదిన్నర కావొస్తోంది. అప్పుడే అంతా వెళ్ళిపోవటం వల్ల నాక్కొంత తీరిక. ఆ సమయంలో కాస్త కాఫీ తాగి మళ్ళీ పనిలో పడటం నా నిత్యకృత్యం. కాఫీ కలుపుకుంట్తోన్న నేను చప్పున ఆగిపోయాను.

''దొంగ...దొంగ..పట్టుకోండి, పారిపోతున్నాడు'' పిల్లాడి నానమ్మ గట్టిగా అరుస్తూ బయటకు పరిగెడ్తోంది. అప్పటికే ఆకుపచ్చ చొక్కా, పసుప్పచ్చ ఫ్యాంటు వేస్కున్న యువకుడొకడు రోడ్డు దాటి పోతున్నాడు. అంతలో బస్సు రావటంతో అతడెవరికీ దొరక్కుండా తప్పించుకుపోయాడు.

వెన్వెంటనే జనం పోగయ్యారు. ఆగి ఆసక్తిగా తొంగి చూసి మెల్లగా జారుకుంటున్న జనం. ముసలావిడ గట్టిగా గుండెలు బాదుకుంటూ ఏడుస్తోంది.

''ఇంతకీ ఏం తీసుకుపోయాడమ్మ?'' ఓ పెద్దాయన అడిగాడు.

''తులంన్నర గొలుసు. మా మనవడి పుట్టిన రోజుకని వాళ్ళ అమ్మమ్మ ఇచ్చింది. దాన్ని లాక్కుని ఆ దొంగ వెధవ పారిపోతున్నాడు. పట్టుకోండయ్యా'' ఆవిడ ఏడుపు తారాస్థాయి నందుకుంది. జరుగుతున్నది ఏంటో అర్థంకాని పిల్లాడు మాత్రం బిక్కమొహం వేస్కుని నానమ్మని కరుచుకున్నాడు.

''ఇంకెక్కడ పట్టుకోవటం? వాడెప్పుడో పరారయ్యాడు. ఇప్పుడు ఏడ్చి ఏం లాభం? ముసల్దానివి. ఇంటికెళ్ళు. ఏ బస్సు కిందో పడి చావగలవు'' ఎవరో కసురుకున్నారు.

''మీకేం బాబూ, అలానే చెప్తారు. ఏం మొహం పెట్టుకుని ఇప్పుడింటికి వెళ్ళాలి? మా కోడలు ఆఫీసు నుండి వస్తే పెద్ద గలాటా అవుతుంది. నాకు గంజి నీళ్ళు కూడా పొయ్యదు. అసలే ఆ గొలుసు వాళ్ళ పుట్టింటాళ్ళిచ్చింది. ఏం చెయ్యనురా భగవంతుడా? పొద్దుటే ఎవరి మొహం చూసానో ఏం పాడో?'' ఆవిడ ముక్కు చీదుతూ కళ్ళు తుడుచుకుంటోంది.

''ఇక్కడ నించుని మాత్రం ఏం చేస్తారు? రండి, పిన్నిగారు'' నేనామెని ఇంటికి తెచ్చాను. ఆమె కొడుకు, కోడలు ఉద్యోగస్థులు.

వాళ్ళకి అన్నీ అమర్చి, వాళ్ళు వచ్చేవరకు ఆ పిల్లాడి ఆలనా పాలనా చూట్టమే ఆమె డ్యూటీ.

''ఇదంతా ఎలా జరిగింది పిన్నిగారూ?'' ఆవిడకి టీ యిచ్చి అడిగాను.

''ఏం చెప్పనమ్మా! అబ్బాయి, కోడలు పిల్ల అలా వెళ్ళారు. ఇంతలో అదిగో ఆ పచ్చచొక్కా అబ్బాయి వచ్చాడు. వాడ్ని యింతకు మునుపు ఎక్కడో చూసిన గుర్తు. అందుకే జ్ఞాపకం చేస్కోటానికని ఆలోచిస్తోంటే, అమ్మా నన్ను మర్చిపోయారా? నేను భాస్కరాన్ని, మీ అబ్బాయితో కలిసి చిన్నప్పుడు చదువుకున్నాను అన్చెప్పాడు. నేను నిజమే కామోసు అనుకున్నాను. కానీ ఇప్పుడు గుర్తొస్తోంది. వాడు చెప్పినవన్నీ అబద్ధాలే. ఇంతకుముందు వాడిని మన మున్సిపల్ పంపు దగ్గర చూసాను'' ఆమె చెప్పటం ఆపేసి కొంగుతో మొహం తుడుచుకుంటూ ఆగిపోయింది.

''ఇంతకీ దొంగతనం ఎలా జరిగింది పిన్నిగారు?'' అన్నాన్నేను ఆత్రంగా.


''చెప్తానమ్మా. అట్లా వాడేదో మాట్లాడుతూ, అమ్మా కొంచెం నీళ్ళిప్పిస్తారా?'' అనడిగాడు.

''అయ్యో, అబ్బాయి స్నేహితునికి మర్యాద చెయ్యకుండా పరధ్యానంలో పడ్డానని నొచ్చుకుంటూ కాఫీ పెట్టటాన్కి వంటగదికి వెళ్ళాను.

ఆ సమయంలో మామనవడ్ని దగ్గరకు తీస్కుని వాడు ఆడిస్తున్నాడు. నేను కాఫీ కలిపి బయట గదిలోకి వచ్చేసరికి వాడు కనిపించలేదు. పిల్లాడు గుమ్మం దగ్గర నుంచుని గేటు వంక చూస్తున్నాడు. అప్పుడు నాకెందుకో అనుమానం వచ్చి చూద్దును కదా పిల్లాడి మెడలో గొలుసు కన్పించలేదు. వెంటనే పరుగులంకించుకున్నాను. కానీ లాభం లేకపోయింది. ఏం చెయ్యనమ్మా! సాయంత్రం అమ్మాయి వస్తే ఏం చెప్పను? ఏం చెప్పినా నమ్మదు.

ఆడపిల్లలకి ఇవ్వటానికి నేనే తీసేసానంటుంది. ముదనష్టపుదాన్ని. వాడ్నెలా నమ్మేసానో?'' ఆవిడ తల పట్టుకుంది.

''భలేవారే, దీంట్లో మీ తప్పేం ఉంది? పెద్దవారు, అసలీ వయసులో పిల్లాడ్ని కనిపెట్టుకు ఉంటమే కష్టం. అయినా ఇప్పుడా పసిపిల్లాడికి అంత ఖరీదయిన నగ పెట్టటమెందుకు? వేసిన మీ కోడలికి బుద్ధిలేదు. అయినా మేమంతా లేమూ? జరిగినదంతా చెప్తాంలెండి.'' అపార్టుమెంట్లో అంతా తలోమాటా చెప్పి మొత్తానికి ఆమెని ఊరడించాం.




అంతలో మా వీధి చివరి నివాసముంటోన్న పెద్దమనిషి ఒకాయన వచ్చాడు.

''ఎందుకమ్మా, నువ్వలా కంగారుపడతావు? ఈ సాయంత్రం నీ కోడలు ఇంటికి వచ్చేలోగా గొలుసు నీ

మనవడి మెళ్లో ఉంటుంది. సరేనా? అదెంత పని? నువ్వేం బాధపడకు.

నువ్వు వాడ్ని గుర్తుపడితే చాలు. పోలికలు ఏమైనా చెప్పు. ఎలా ఉంటాడు? పొడుగా పొట్టా? తెలుపా నలుపా? ఎలాంటి బట్టలు వేసుకున్నాడు?'' అంటూ అన్ని విషయాలు ఆరా తీసాడు.

ఆమె ఏవో గుర్తులు చెప్పింది. అతడి బట్టల రంగు చెప్పింది. ఆ యువకుడు కొంచెం నత్తిగా మాట్లాడినట్టు కూడా చెప్పింది.




అతడూ ఏవో చెప్పాడు. ఆ పెద్దమనిషి మాటల్ని బట్టి చూచాయిగా


వాడెవడో అతనికి అర్థమైందనిపించింది.

''చూడమ్మా, సాధారణంగా ఇలాంటి చిల్లర దొంగతనాలు చేసేది చిన్న చిన్న దొంగలే. వాళ్ళంతా యించుమించు యీ ప్రాంతాల్లోనే తిరుగుతుంటారు.

ఎంతో దూరం కూడా పోరు. ఇక్కడంతా మనకు తెలిసిన వాళ్ళే. అందువల్ల నువ్వేం భయపడకు. ఇప్పుడే మన మనుష్యుల్ని పంపి వాడు నీ కాళ్ళమీద పడేట్టుచేస్తాను'' అట్లా ఆమె కభయమిచ్చి అత డు వెళ్లిపోయాడు.

మా ప్రాంతానికే మంచి పేరున్న వ్యక్తి అతడు. ఎవరికి ఎలాంటి సహాయం కావాలన్నా చేస్తాడు.




అతనిమీద అందరికీ నమ్మకం. అతనంటే అందరికీ గౌరవం. అతనంటే అందరికీ భయం.. అంతా గడగడలాడాల్సిందే. అందువల్ల ఆమె సయితం కొంత స్థిమితపడింది.

కష్టపడి ఆమె నెలానో ఒప్పించి రెండు మెతుకులు తినేట్టు చేయగలిగాను. గొలుసు పోయిందన్న బాధ కంటే, కోడలు చేయబోయే సాధింపే ఆమెను విపరీతంగా భయపెడ్తోంది.

మధ్యాహ్నం మూడవుతోంది. వేసవికాలం అవ్వటం మూలాన ఆకాశం ఎండని ఆరబోసింది. మా వీధి చివరి పెద్దమనిషి పచ్చచొక్కా యువకుడ్ని తీసుకువచ్చినట్టున్నాడు.

పక్కింటి పిన్నిగారు బయటికి వచ్చారు. ఆ సందడికి నేనూ బయటికి వచ్చాను.

''చూడమ్మా, వీడేనా ఉదయం మీ యింటికి వచ్చాడు?''

''ఆ..వీడే వీడే..వీడే, గొలుసు పట్టుకు పోయింది వీడే'' దొంగ దొరికాడన్న సంతోషం ఓ పక్క, గొలుసు ఉందో లేదో అన్న ఆత్రుత ఓ పక్క ఆమె గొంతులో విన్పిస్తోంది.

''చూడ్రా వెధవా, ముందావిడ కాళ్ళమీద పడి క్షమాపణ చెప్పు. ఏదీ ఆ గొలుసు బయటకు తియ్యి..''

''నాకేం తెలీదు బాబూ, యీ గొలుసు నాది. మేం కూటికి చెడ్డవాళ్ళమైనా గుణానికి మాత్రం కాదు. నేనుదయం వచ్చిన మాట నిజమే. మంచినీళ్ల డిగిన మాటా నిజమే. కానీ ఆవిడ ఎంతకీ బయటకి రాకపోతే నేను వెళ్ళిపోయాను. నాకేం తెలీదు బాబు.''

పెద్దాయనికి బాగా కోపం వచ్చింది. వాడి జుట్టుపట్టుకుని దబదబా బాదాడు. మళ్ళీ జనం గుమిగూడారు. తలో దెబ్బా వేసారు.

వాడు చేతులెత్తి దండం పెడ్తూ తనకేం తెలీదని మొరపెడ్తూనే ఉన్నాడు.

చివరికి పెద్దాయన ఏం అనుకున్నాడో అందర్నీ వారించి, వాడ్ని తనతోపాటు పక్కకి తీసుకెళ్ళాడు. అతనలా చేయటంతో మిగిలిన వాళ్ళంతా ఎవరికివారే నెమ్మదిగా జారుకున్నారు.

నేను, పిన్నిగారు మిగిలాం. ఓ పావుగంట తర్వాత పెద్దమనిషి మాదగ్గరకి వచ్చాడు.

''చూడమ్మా, వాడు ఆ గొలుసు తనదే అంటున్నాడు. కాదంటే ససేమిరా ఒప్పుకోవటంలేదు. ఇదంతా ఎందుగ్గానీ, ఆ గొలుసు ఏం లేదన్నా ఏడువేలదాకా ఉంటుందనుకుంటాను. అయిదొందలు ఇచ్చేస్తే వాడే ఇచ్చేస్తాడు. ఎందుకంటే వాడు ఏదో బాధల్లో ఉన్నట్టున్నాడు. వాళ్ళమ్మకి ఒంట్లో బాలేదంట. ఏదో చెప్తున్నాడు. ఎవరన్నా కూటికి గతిలేకే కదా ఇలాంటి పనులు చేసేది. పుట్టుకతో ఎవడూ దొంగ కాడు.''

పిన్నిగారి మనసు కరిగింది. అయిదొందలు పారేస్తే అతడన్నట్టు తులంన్నర గొలుసు దొరుకుతుంది. ఇప్పుడు పోలీస్ కంప్లయింటిచ్చినా ఇంతకంటే ఎక్కువే అవుతుంది. మళ్ళీ అదో గొడవ. ఎందుకిదంతా అనుకుంటూ కూతుళ్ళ కోసం దాచిపెట్టిన అయిదొందలు మడతమీద తెచ్చి పెద్దమనిషికిచ్చింది. అతడు మళ్ళీ వాడి దగ్గరకు వెళ్ళి ఏదో మాట్లాడి, గొలుసు తీసుకువచ్చాడు.

తర్వాత వాడ్ని మళ్ళీ హెచ్చరించి వెళ్లిపోయాడు.

పిన్నిగారు యింకోసారి పెద్దాయన మేలు మరవలేనని చెప్పి కళ్ళొత్తుకుంది.

ఈ సంఘటన జరిగి పదిహేన్రోజులయింది. నేను కూరగాయలు తేటానికని బజారు కెళ్ళాను.

నాకొంచెం దూరంలో జనం మధ్య, సరిగ్గా నాకెదురుగా ఎక్కడో చూసిన మొహం-నీలం చొక్కా, ఎరుపు ఫ్యాంటుతో.

ఆ యువకుడే మున్సిపల్ కుళాయి దగ్గరకి వచ్చేవాడు. కాదు..కాదు పిన్నిగారింటి గొలుసు దొంగ. అది పెద్ద ఆశ్చర్యకరమైన విషయంగాదు. ఎందుకంటే అతడు ఎప్పుడూ ఆ ప్రాంతంలోనే తచ్చాడుతుంటాడన్న విషయం అందరికీ తెలుసు.

ఇప్పటికి నాకు మింగుడు పడిన నిజమల్లా ఒక్కటే. ఆ దొంగ ఎదురుగా ఆ పెద్దమనిషి అతని మొహం నాక్కనిపించక పోయినా వెనకనుండి నేనతన్ని సులువుగా గుర్తుపట్టగలను. ఎందుకంటే మా వీధి అంతటికీ అతనే తీర్పు చెప్పే పెద్దమనిషి కాబట్టి! ఆ కుర్రాడికీ, ఆ పెద్దమనిషికీ మధ్య వ్యవహారం, లింకు ఏమిటో నాకిప్పటికీ అర్థం కాలేదు!

★



## గడసరి ఊర్మిళ

ఊర్మిళను ''మీ చెల్లెలి పెళ్ళయిపోయింది. మరి పెద్దదానివైన నీ పెళ్ళికాకుండా, మీ చెల్లెలి పెళ్ళికావడం మీకు బాధనిపించడం లేదా?'' అని ప్రశ్నిస్తే, ఆమె పకపకా నవ్వేసింది. ''మీరింకా గత శతాబ్దంలో ఉన్నట్టున్నారండీ. కాలం మారిందండీ. ఈ కాలంలో అమ్మాయి ఫలానా వయసులోనే పెళ్ళి చేసుకోవాలని అనుకోవడం లేదు. ప్రస్తుతం ఇరవై, ముప్పై, యాభై- ఏ వయసులోనయినా సరే, పెళ్ళి చేసుకోవచ్చు అని ఆడపిల్లలు అనుకుంటున్నారు. నిజానికి ఆడదానికి పెళ్ళే ముఖ్యం కారాదు. ప్రస్తుతానికి నేను నా వర్క్‌తో బిజీ. పెళ్ళి అనేది మనం పూర్తిగా కోరుకున్నప్పుడే జరగవలసిన కార్యం'' అంటూ పెద్ద ఉపన్యాసమే చెప్పుకొచ్చింది. అయితే ''రామ్‌గోపాల్‌వర్మ ముంబాయిలో మీ ఫ్లాట్ పక్కన ఫ్లాట్ కొన్నాడనీ, అతడు హైదరాబాద్‌లో ఉన్న తన భార్య నుండి సపరేట్ కావాలనుకుంటున్నాడని తెలిసింది?'' అని ప్రశ్నిస్తే మాత్రం ''నో కామెంట్'' అంటూ ఒక్క వాక్యంతో తేల్చేసింది. ఊర్మిళ మహా గడుసు సుమా!

-జె.వి.బాబు